సాక్షి
విశాఖపట్నం
శనివారం । 29 । జూన్ । 2024



ఉక్కు ఉద్యోగులకు కొత్త చిక్కులు

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ పీఎఫ్ మినహాయింపు ట్రస్ట్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 8లో



రేపటి నుంచి ఏపీఎల్

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ మూడో సీజన్‌కు జట్లు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ మొదలుపెట్టాయి. 8లో



పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

పలు రైళ్లకు తాత్కాలిక పద్ధతిలో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారి నందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

జూనియర్ గోల్ఫ్ చాంప్ కేయకుమార్



కేయకుమార్

విశాఖ స్పోర్ట్స్: ఇండోనేషియాలోని బాలిలో జరిగిన అంతర్జాతీయ జూనియర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌లో విశాఖ గోల్ఫర్ బి.కేయకుమార్ విజేతగా నిలిచింది. ఈ విజయంతో ప్రపంచ ర్యాంకింగ్‌లో స్థానం సాధించిన కేయ పలు విజయాలను ఏడేళ్లుగా సాధిస్తూ వస్తోంది. గతేడాది జరిగిన జాతీయ క్రీడల్లో ఢిల్లీకి ప్రాతినిథ్యం వహించింది. భారత గోల్ఫింగ్ సమాఖ్య ప్రకటించిన తొలి 15 మంది బాలికల గోల్ఫర్ల మెరిట్‌లో స్థానం సాధించింది. అత్యుత్తమ్మ ప్రదర్శన కనబరిచినందుకు కేయకుమార్ ప్రతిష్టాత్మక ఢిల్లీ గోల్ఫ్ క్లబ్ నిర్వహించే స్ట్రైవ్ ఫర్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమాలకూ ఎంపికైంది.

డ్రెడ్జ్-8 నౌకలో అత్యవసర మరమ్మతులు పూర్తి



మరమ్మతులు పూర్తి చేసుకున్న డ్రెడ్జ్-8 నౌక

విశాఖ సిటీ: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) కేవలం అయిదు రోజుల్లోనే అత్యవసర డ్రై డాకింగ్ పనులను విజయవంతంగా పూర్తి చేసింది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన డ్రెడ్జ్-8 నౌక అత్యవసర మరమ్మతుల కోసం ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు హెచ్‌ఎస్‌ఎల్‌కు వచ్చింది. సంస్థ అధికారులు, సిబ్బంది 24 గంటల ప్రణాళికతో ఐదు రోజుల్లో పనులు పూర్తి చేశారు. దీనిపై హెచ్‌ఎస్‌ఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి అధికారులు, సిబ్బందిని అభినందించారు. సాంకేతికతతో రికార్డు సమయంలో సేవలు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. 1977లో నిర్మించిన ఈ డ్రెడ్జ్-8 నౌక 47 ఏళ్ల నుంచి డీసీఐఎల్‌లో సుదీర్ఘ సేవలందిస్తోంది.


డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి వెబ్ ఆప్షన్లు



డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి

భీమునిపట్నం: జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ కోసం అభ్యర్థులు వెబ్ ఆప్షన్‌ను ఇచ్చుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి శుక్రవారం తెలిపారు. జూన్ 30వ తేదీ నుంచి జూలై 4వతేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని మొదటి విడతలో సీటు రానివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. వెబ్ ఆప్షన్‌లో ఎంచుకునేవారికి జూలై 5వ తేదీ నుంచి 7వతేదీ వరకు సీట్లు కేటాయింపులు ఉంటాయని, జూలై 9వ తేదీ నుంచి 13 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతాయని తెలిపారు.

జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి (ఎంప్లాయ్‌మెంట్) అధికారి శాంతి (టెక్నికల్) తెలిపారు. ఆరు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 300 ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 105 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 50 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శాంతి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ సుబ్బిరెడ్డి, జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, ఐటీఐ, అప్రెంటిస్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

‘డీజీ యాత్ర’ రెడీ

- మొబైల్‌లో సాఫ్ట్ కాపీతో నేరుగా ఎయిర్‌పోర్టులోకి..
- ఫేస్ రీడింగ్‌తో తగ్గనున్న చెకింగ్ పాయింట్లు
- విమాన ప్రయాణికులకు కలిసి రానున్న సమయం
- విశాఖ విమానాశ్రయంలో మొదలైన ట్రయల్ రన్
- త్వరలోనే పూర్తి స్థాయిలో అమలుకు సన్నాహాలు



ఎయిర్‌పోర్టులో డీజీ యాత్ర గేట్లు

సాక్షి, విశాఖపట్నం: విమాన ప్రయాణికులు ఇకపై మునుపటిలా ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు. విమానం ఎక్కడానికి గంటన్నర, రెండు గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవలసిన పని లేదు. వివిధ తనిఖీల కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టే ‘డీజీ యాత్ర’ సదుపాయం విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో అందుబాటులోకి వస్తోంది. దీంతో ప్రయాణికులకు వివిధ రకాల చెక్‌ల నుంచి ఉపశమనం కలగనుంది. డిపాచర్ పాయింట్ వద్ద సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది బోర్డింగ్ పాస్, గుర్తింపు కార్డును తనిఖీ చేస్తుంటారు. ఇకపై డీజీ యాత్రతో మొబైల్ ఫోన్‌లో సాఫ్ట్ కాపీని చూపించి నేరుగా ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించే వీలుంటుంది. ఈ డీజీ యాత్ర కాగిత రహిత ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. దేశంలోని 12 ఎయిర్‌పోర్టుల్లో డీజీ యాత్ర సదుపాయాన్ని అమలు చేస్తున్నారు. వీటిలో మన విశాఖ విమానాశ్రయం కూడా ఉంది. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చించారు. ఈ ‘డీజీ యాత్ర’ వల్ల విమానాశ్రయంలో ప్రయాణికుల డిజిటల్ ప్రాసెసింగ్ ద్వారా చెక్ పాయింట్ల వద్ద ముఖ గుర్తింపు వ్యవస్థ ఆధారంగా ప్రాసెస్ చేయబడతారు. దీంతో ఎంట్రీ పాయింట్ చెక్, సెక్యూరిటీ చెక్‌లోకి ప్రవేశించడం, ఎయిర్‌క్రాఫ్ట్ బోర్డింగ్ వద్ద గేట్లు తెరుచుకుంటాయి. ఇంకా ప్రయాణికుల డేటా రీకాల్‌ను గుర్తించడానికి ముఖ గుర్తింపు ద్వారా సెల్ఫ్ బ్యాగ్ డ్రాప్, చెక్ ఇన్‌ను కూడా సులభతరం చేస్తుంది. ఇలా బహుళ పాయింట్ల వద్ద గుర్తింపు తనిఖీని నివారిస్తుంది.

డీజీ యాత్ర పనితీరు ఇలా..

ప్రవేశ ద్వారం ఈ–గేటు వద్ద ప్రయాణికుడు తన బోర్డింగ్ పాస్ లేదా ఈ–టికెట్ (మొబైల్‌లో ప్రింట్ లేదా సాఫ్ట్ కాపీ) స్కాన్ చేస్తుంది. బార్ కోడ్/క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేశాక సిస్టం ప్రయాణికులు, విమాన వివరాలను ధ్రువీకరిస్తుంది. డీజీ యాత్ర ఐడీ ముఖ గుర్తింపు ద్వారా గుర్తింపును ధ్రువీకరిస్తుంది. టికెట్, డీజీ యాత్ర ఐడీ సక్సెస్ అయినట్టు నిర్ధారణ అయ్యాక ఈ–గేటు తెరవబడుతుంది. ఎయిర్‌పోర్టులో మిగిలిన ప్రయాణానికి టికెట్ పీఎన్‌ఆర్‌తో ముఖం ఒకే టోకెన్‌లో తయారు చేయబడుతుంది. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టంలో ఈ–గేట్ ద్వారా ప్రయాణికుడు సెక్యూరిటీ ఏరియా, ఎయిర్ క్రాఫ్ట్ బోర్డింగులోకి ప్రవేశానికి వీలవుతుంది.

ఇవీ ప్రయోజనాలు..

ప్రయాణికులు ఇదివరకు మాదిరిగా బహుళ చెక్ పాయింట్ల వద్ద బోర్డింగ్ పాస్ లేదా ఐడీని చూపించాల్సిన అవసరం లేదు. కనీస మానవ జోక్యంతో క్యూలో నిల్చునే సమయం బాగా తగ్గుతుంది. ప్రయాణికులను పీఎన్‌ఆర్‌తో మ్యాప్ చేస్తుంది.. కాబట్టి భద్రత మెరుగు పడుతుంది. ప్రతి చెక్ పాయింట్ వద్ద సిసలైన ప్రయాణికులను మాత్రమే అనుమతిస్తుంది. ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌కు ప్రయాణికుల లోడ్‌పై నిర్దిష్ట సమయ సమాచారం ఉంటుంది. వీటన్నిటి ఫలితంగా విమాన ప్రయాణికుడు వేచి ఉండే సమయం, ప్రయాస చాలా వరకు తప్పుతుంది. అంటే ఎయిర్‌పోర్టులో పట్టే సమయం 30 నిమిషాల నుంచి 5–10 నిమిషాలకు తగ్గుతుంది.

ట్రయల్ రన్ ప్రారంభం



విశాఖ విమానాశ్రయంలో ‘డీజీ యాత్ర’పై రెండు రోజుల క్రితం నుంచి ట్రయల్ రన్ చేపట్టాం. రోజుకు 100–150 మంది వరకు డీజీ యాత్ర ద్వారా వెళ్తున్నారు. డీజీ యాత్ర వినియోగానికి వీలుగా నాలుగు గేట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే డీజీ యాత్రను అధికారికంగా ప్రారంభిస్తాం. ఈ ఎయిర్‌పోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు రోజుకు సగటున నాలుగు వేల మంది ప్రయాణికులు వెళ్తుంటారు. మున్ముందు వీరంతా డీజీ యాత్ర ద్వారానే పయనించే వీలుంటుంది.

– ఎస్. రాజారెడ్డి,
డైరెక్టర్, విశాఖ ఎయిర్‌పోర్టు.

నగర పోలీస్ కమిషనర్‌గా శంఖబ్రతా బాగ్చి



- ప్రస్తుత సీపీ రవిశంకర్ సీఐడీకి బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనర్‌గా అడిషనల్ డైరెక్టర్ జనరల్ (లా అండ్ ఆర్డర్) శంఖబ్రతా బాగ్చి నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ సీపీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎ.రవిశంకర్ సీఐడీ ఏడీజీగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన బాగ్చి 1996 ఐపీఎస్ బ్యాచ్‌కు ఎంపికయ్యారు. దేశ రాజధాని, కోల్‌కతా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా కూడా విధులు నిర్వర్తించారు. 1997లో ప్రొబేషనర్‌గా చేరిన బాగ్చి జమ్మలమడుగు ఏఎస్పీ, కడప, ఓఎస్‌డీ, కోల్‌కత్తాలో సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అలాగే నిజామాబాద్ ఎస్పీగాను, ఏపీఎస్పీ 1వ బెటాలియన్ హైదరాబాద్‌లోను, కర్నూల్ ఎస్పీ, గుంటూరు ఎస్పీ, గ్రేహౌండ్స్, డీఐజీగా విధులు నిర్వర్తించారు. అదే విధంగా సీఐడీ డీఐజీగానే కాకుండా న్యూఢిల్లీలో సీబీఐ డీఐజీగాను వ్యవహరించారు. అనంతరం ఏసీబీ డైరెక్టర్‌గాను, ఏపీఎస్పీ బెటాలియన్ ఏడీజీగా, ఇంటెలిజెన్స్ ఏడీజీగా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా, డీజీ కార్యాలయంలో అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(పర్సనల్–అడ్మిన్)గా, లా అండ్ ఆర్డర్ ఏడీజీగా, ఏపీ స్టేట్ డిజాస్టర్స్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్‌గానే కాకుండా రాష్ట్ర ఇంచార్జ్ డీజీపీగా కూడా వ్యవహరించారు. తాజాగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా నియమించింది. ఇదిలా ఉంటే విశాఖ కమిషనరేట్‌ను ఏడీజీ స్థాయికి గత వైఎస్సార్ ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఏడీజీగా ఉన్న రవిశంకర్‌ను విశాఖ సీపీగా నియమించింది. తాజాగా కొత్త ప్రభుత్వం కూడా వైసీపీ బాటలోనే ఏడీజీ స్థాయి అధికారిని విశాఖ పోలీస్ కమిషనర్‌గా నియమించడం విశేషం.

రవిశంకర్ అద్భుత సేవలు

విశాఖ సీపీగా ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన డాక్టర్ రవిశంకర్ అయ్యనార్‌ను ప్రభుత్వం సీఐడీ ఏడీజీగా బదిలీ చేశారు. 2023, సెప్టెంబర్ 15న నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవి శంకర్ కీలక నిర్ణయాలతో తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రధానంగా స్పందన, డయల్ యువర్ సీపీతో పాటు రాష్ట్రంలోనే తొలిసారిగా దివ్యాంగులు, వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం తీసుకున్న చర్యలు సత్ఫలితాన్నిచ్చాయి. దివ్యాంగ సురక్ష కార్యక్రమానికి రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా దివ్యాంగులు వారి సమస్యలపై ఫిర్యాదు చేస్తుండడం ఇందుకు నిదర్శనం. అలాగే సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల కంబోడియా కేంద్రం విశాఖ నుంచే కాకుండా దేశంలో పలు రాష్ట్రాల నుంచి హ్యూమన్ ట్రాఫికింగ్ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కంబోడియాలో చైనాకు చెందిన సైబర్ గ్యాంగ్ చేతిలో చిక్కుకున్న బాధితులను సురక్షితంగా దేశానికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా సొంత శాఖలో అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారంపై చొరవ తీసుకున్నారు. తాజా బదిలీల్లో ప్రభుత్వం రవిశంకర్‌ను సీఐడీ ఏడీజీగా బదిలీ చేసింది.

రెండు స్కూల్ బస్సులపై కేసులు

గోపాలపట్నం: నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న రెండు స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. అలాగే 3 ఆటోలను సీజ్ చేశారు. ఈ నెల 13 నుంచి రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పరిమితికి మించి స్కూల్ పిల్లలను ఎక్కించుకుని వెళుతున్న ఆరు ఆటోలపై చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు రవాణాశాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో 36 స్కూల్ బస్సులపై, 24ఆటోలపై కేసులు నమోదు చేసినట్టు మోటారువాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మాధవి, రాజారావు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

నేటి నుంచి సురభి నాటకోత్సవాలు



మాట్లాడుతున్న బాదంగీర్ సాయి

అల్లిపురం: భారతదేశ నాటకరంగ చరిత్రలో 140 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభి నాటకోత్సవాలు శనివారం నుంచి వారం రోజుల పాటు మద్దిలపాలెం కళాభారతిలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బాదంగీర్ సాయి, సీనియర్ జర్నలిస్టు నాగబోయిన నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు డాబాగార్డెన్స్, వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. శనివారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6.15 గంటల నుంచి ప్రదర్శన ఉంటుందన్నారు. శనివారం మాయాబజార్, ఆదివారం భక్త ప్రహ్లాద, జూలై 1న లవకుశ, 2వ తేదీన భూ కైలాస్, 3వ తేదీన పాతాళభైరవి, 4వ తేదీన శ్రీకృష్ణ లీలలు, 5వ తేదీన మరోసారి మాయాబజార్ నాటకాన్ని కళాభారతి వారి సౌజన్యంతో ఆ రోజు ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులుగా బాదంగీర్ సాయి, నాగబోయిన నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ఎస్ఆర్‌కే ఇన్ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ చైర్మన్ ఎంఎస్‌ఎన్ రాజు, కంచర్ల అచ్యుతరావు, కళా హాస్పటల్ డాక్టర్ పీవీ రమణమూర్తి, వీవీ వామనరావు, వీవీ రమణ మూర్తి, డాక్టర్ సూరపనేని విజయకుమార్, మావూరి వెంకటరమణ, పైడా కృష్ణప్రసాద్ సహకారంతో సురభి నాటకోత్సవాలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. ఈ నాటకాలను తిలకించేందుకు ఏ విధమైన ప్రవేశ రుసుం లేదన్నారు. అందరూ ఆహ్వానితులే అన్నారు.

మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యంవి దిగజారుడు వ్యాఖ్యలు

ఉక్కునగరం: ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప అన్నారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తీసేసి రాజధాని కడదామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనతో చెప్పారని ఇటీవల ఒక పచ్చ చానల్‌లో ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు చేయడం ద్వారా ఆయన సీనియర్ ఐఏఎస్ స్థాయిని దిగజార్చారన్నారు. నూరు శాతం కేంద్ర ప్రభుత్వంలో ఉన్నటువంటి ఉక్కు కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూల్చి అక్కడ రాజధాని ఎలా కట్టగలదో సుబ్రహ్మణ్యం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే నిజమైతే ఐదేళ్లుగా ఆయన ఈ విషయాన్ని బయటకు చెప్పకుండా మౌనంగా ఎందుకున్నారని ఆయన ప్రశ్నించారు. కొందరి నాయకులు, ప్రభుత్వం మెప్పు కోసం ఇలాంటి కల్పిత వ్యాఖ్యలు చేసినట్టు ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. 2021లో ఉక్కు కర్మాగారం నుంచి నూరు శాతం పెట్టుబడుల ఉపసంహరణ చేసిన నాటి నుంచి నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్రాన్ని వ్యతిరేకించిన విషయం అందరికీ తెలుసన్నారు. ఆ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ప్రధానికి లేఖలు రాయడంతో పాటు అసెంబ్లీలో వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపిన విషయం విధితమేనన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశంలో హైకోర్టు సైతం ముఖ్యమంత్రి లేఖలకు ఎందుకు వివరణ ఇవ్వలేదో కోర్టుకు తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

హిందీని అధికార భాషగా ఐక్యరాజ్యసమితి గుర్తించాలి

విశ్వ హిందీ పరిషత్ చైర్మన్ యార్లగడ్డ



విశాఖ సిటీ: హిందీని అధికార భాషగా ఐక్యరాజ్య సమితి గుర్తించాలని విశ్వ హిందీ పరిషత్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏయూ హిందీ విభాగంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాషకు గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. హిందీ ప్రాచుర్యానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి కొనియాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల విద్యార్థులు హిందీ నేర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో చట్టాలన్ని హిందీలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్‌కు భారతరత్న సాధిస్తామని చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: ఒకటి నుంచి ఏడు వరకు జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) ఎం. పోలినాయుడు శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘాల సమావేశాలు, ఉదయం 11 గంటలకు నాలుగు, మూడో స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఒకటి, ఆరు, ఏడు స్థాయీ సంఘ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

నారాయణ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ దాష్టీకం

- క్రమశిక్షణ పేరుతో విద్యార్థిని తీవ్రంగా కొట్టిన వైనం
- విశాఖ మధురవాడ దుర్గానగర్‌లో కళాశాలలో ఘటన



మధురవాడ నారాయణ క్యాంపస్‌లో విద్యార్థి బంధువుల ఆందోళన

మధురవాడ : నారాయణ విద్యాసంస్థల్లో ఆగడాలు ఆగడం లేదు. లక్షల్లో ఫీజు కట్టిన విద్యార్థులను క్రమశిక్షణ పేరుతో వేదిస్తూ తీవ్రంగా కొడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖపట్నం మధురవాడ దుర్గానగర్‌లో ఉన్న నారాయణ ఐఐటీ అండ్ మెయిన్స్ అకాడమీ డే క్యాంపస్‌లో సహచర విద్యార్థినితో మాట్లాడాడని ఓ విద్యార్థిని ప్రిన్సిపాల్ చెంపమీద కొట్టడమే కాకుండా అతడిని మూడో ఫ్లోర్ నుంచి కొట్టుకుంటూ గ్రౌండ్‌ఫ్లోర్ వరకు లాక్కొచ్చారు. బాధిత విద్యార్థి, అతడి తల్లిదండ్రులు తెలిపిన మేరకు.. పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన షేక్ హిమామ్ పదిరోజుల కిందట ఇక్కడ ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం సీఈవో మెయిన్స్ బ్రాంచ్‌లో చేరాడు. హిమామ్ కళాశాలలో ఆలస్యంగా జాయిన్ కావడంతో గురువారం అదే సెక్షన్‌లో ఉన్న ఓ విద్యార్థినితో నోట్స్ విషయమై మాట్లాడాడు. ఇది గమనించిన ప్రిన్సిపాల్ రాజేష్ కనీస విచారణ చేయకుండానే చెంపపై గట్టిగా కొట్టారు. భయం, నొప్పితో విద్యార్థి అరవడంతో బోర్డుకు తల గుద్దించి, మూడోఫ్లోర్ నుంచి కొట్టుకుంటూ కిందికి లాక్కొచ్చారు. చెంప నల్లగా మారిపోయిన హిమామ్‌ను సహచర విద్యార్థుల సమక్షంలో ఇస్టానుసారం కొట్టారు. ఈ విషయాన్ని హిమామ్ తల్లిదండ్రులకు చెప్పి బాధపడ్డాడు. దీంతో శుక్రవారం అతడి తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిని నిలదీశారు. తల్లిదండ్రుల నిరసనతో ఈ దాష్టీకం బయటకు పొక్కింది. పీఎంపాలెం పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. దీనిపై ప్రిన్సిపాల్ రాజేష్‌ను అడగగా.. విద్యార్థులు అమ్మాయిలతో మాట్లాడకూడదని ముందే చెప్పినా పట్టించుకోలేదని, హిమామ్‌ను సన్మార్గంలో పెట్టడం కోసం చెంపపై కొట్టానని, క్రమశిక్షణ చర్యలే తప్ప మరేం కాదని చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. గతంలో కూడా ఈ క్యాంపస్‌లో ఇలాంటి సంఘటనలు వెలుగులోకి వచ్చినట్లు పలువురు చెబుతున్నారు. కొద్దినెలల కిందట యాజమాన్యం నిర్లక్ష్యం, మితిమీరిన ఒత్తిడి కారణంగా పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న నారాయణ క్యాంపస్‌లో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.

3న డివిజనల్ స్థాయి డాక్ అదాలత్

మహారాణిపేట: డివిజనల్ స్థాయి డాక్ అదాలత్ కార్యక్రమాన్ని జూలై 3వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు తపాలా శాఖ సీనియర్ సూపరింటిండెంట్ గజేంద్ర కుమార్ మీనా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏవీఎన్ కాలేజ్ డౌన్ రోడ్డులో గల వెలంపేట వద్ద నున్న తపాలా శాఖ సీనియర్ సూపరింటిండెంట్ కార్యాలయం ఆవరణలో డాక్ అదాలత్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోస్టల్ సేవలకు సంబంధించిన నిర్దిష్ట వ్యక్తిగత, ప్రజా ఫిర్యాదులను మాత్రమే స్వీకరించనున్నట్లు చెప్పారు. విశాఖపట్నం పోస్టల్ డివిజన్‌కు సంబంధించిన తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు/అభ్యంతరాలను కవరులో పెట్టి 11వ డివిజనల్ లెవల్ డాక్ అదాలత్ అని రాస్తూ గజేంద్ర కుమార్ మీనా, తపాలా శాఖ సీనియర్ సూపరింటిండెంట్, విశాఖపట్నం డివిజన్, విశాఖపట్నం – 530 001 చిరునామాకు జూలై 2వ తేదీలోగా పోస్టు ద్వారా లేదా స్వయంగా అందజేయవచ్చని సూచించారు.

‘యూహెచ్3హెచ్’ హెలికాప్టర్‌కు ఘన వీడ్కోలు



యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ స్క్వాడ్రన్



ఇన్‌చార్జ్ కలెక్టర్ అశోక్‌కు స్మారక ఫలకాన్ని అందజేస్తున్న సమీర్ సక్సేనా తదితరులు

ఎంవీపీకాలనీ: భారత నావికాదళంలో 17 ఏళ్ల పాటు అద్భుతమైన సేవలందించిన యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్‌కు తూర్పునావికాదళం ఘన వీడ్కోలు పలికింది. ఈ మేరకు విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో డి–ఇండక్షన్ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తూర్పు నావికాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సమీర్ సక్సేనా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా యూహెచ్3హెచ్ స్క్వాడ్రన్‌లోని అనుభవజ్ఞులైన అధికారులు, నావికులు పాల్గొన్నారు. 17 ఏళ్లుగా పాటు ఈ హెలికాప్టర్ అందించిన అద్భుత సేవలను వారు వివరించారు. యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ సేవలను ఐఎన్ఏఎస్ 350 వద్ద సీ కింగ్ 42సీ హెలికాప్టర్‌తో భర్తీ చేసినట్లు వెల్లడించారు. 2007లో ఐఎన్ఎస్ జలశ్వతో పాటు యూహెచ్3హెచ్ హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మార్చి 24, 2009 నుంచి విశాఖ ఐఎన్ఎస్ డేగా వద్ద ఐఎన్ఏఎస్ 350 సారస్‌గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. తన సేవలతో యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. విశాఖలోని సిటీ ఆఫ్ డెస్టినీలోని ప్రముఖ ప్రదేశంలో ఈ హెలికాప్టర్ శాశ్వతంగా ప్రదర్శనకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన స్మారక ఫలకాన్ని చీఫ్ ఆఫ్ స్టాఫ్ సమీర్ సక్సేనా విమానాల బదిలీకి గుర్తుగా విశాఖ ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు అందజేశారు.

ఎస్సీలంటే చంద్రబాబుకు చిన్నచూపు

- మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగమల్లీశ్వరి

అల్లిపురం: ఎస్సీలంటే చంద్రబాబుకు చిన్నచూపని మాలమహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంచా నాగ మల్లీశ్వరి ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గాలకు చెందిన ఓట్లతో అధికారంలోకొచ్చిన చంద్రబాబు ఇప్పుడు కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించడం సరికాదని పేర్కొన్నారు. బాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా.. ఎస్సీలను అణగదొక్కడమే పనిగా పెట్టుకుంటారని తెలిపారు. అంబేడ్కర్ ఆలోచన విధానానికి ఎవరు అడ్డుపడినా.. నామరూపాలు లేకుండా పోతారని ధ్వజమెత్తారు. చంద్రబాబు హయాంలో దళితులకు జరిగిన అవమానాలు అన్నీ ఇన్నీ కాదని పేర్కొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు కొత్త చిక్కులు!

- ఆరు నెలలుగా ఈపీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్‌కు పీఎఫ్ చెల్లించని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం
- రూ.270 కోట్ల వరకు బకాయిలు!
- ట్రస్ట్ లావాదేవీలపై ఈపీఎఫ్‌వోకు అందని సమాచారం
- ట్రస్ట్‌కు ఈపీఎఫ్‌వో మినహాయింపు రద్దు అవుతుందని ఉద్యోగుల ఆందోళన



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ మినహాయింపు ట్రస్ట్ (ఈపీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్) పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వైఖరి కారణంగా ఆరు నెలలుగా ట్రస్ట్ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. దీంతో ఈపీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్ పనితీరుపై ఈపీఎఫ్‌వో అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ట్రస్ట్‌కు ఈపీఎఫ్ మినహాయింపులు తొలగించే అవకాశం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ట్రస్ట్ సేవలు ఇలా...

స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉద్యోగుల ఈపీఎఫ్ నిర్వహణకు సంబంధించి ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్‌కు ఈపీఎఫ్‌వో అనుమతిచ్చింది. ఉద్యోగుల కంట్రిబ్యూషన్, యాజమాన్యం వాటాలను ట్రస్ట్‌కు బదిలీ చేస్తారు. ఆ డబ్బులను ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ తదితర ఆర్థిక సంస్థల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా ట్రస్ట్ లాభాలబాటలో నడిచేది. ఈపీఎఫ్‌వో ప్రతి ఏడాది ప్రకటించే వడ్డీ కంటే ట్రస్ట్ అదనంగా వడ్డీ ఇచ్చిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నిబంధనల మేరకు ప్రతి నెలా ట్రస్ట్ ఆన్‌లైన్ రిటర్న్స్‌ల గురించి ఈపీఎఫ్‌వోకు సమాచారం అందించాలి. అయితే, ఈ ఏడాది జనవరి నుంచి ఉద్యోగుల ఈపీఎఫ్‌ను యాజమాన్యం చెల్లించకపోవడంతో సమస్య ప్రారంభమైంది. యాజమాన్యం ప్రతి నెలా సుమారు రూ.70 కోట్లు ట్రస్ట్‌కు చెల్లించాల్సి ఉంది. జనవరి నుంచి ఈ ప్రక్రియ ఆగిపోవడంతో ట్రస్ట్ ప్రతినిధులు కూడా ఈపీఎఫ్‌వోకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదు. దీంతో ఈపీఎఫ్‌వో నుంచి ట్రస్ట్‌కు నోటీసులు వస్తున్నాయి. చివరగా ఈ నెల 24న ఈపీఎఫ్‌వో నుంచి ట్రస్ట్ ప్రతినిధులకు ఒక నోటీసు వచ్చింది. రెండు రోజుల్లోపు ట్రస్ట్ లావాదేవీలను సక్రమంగా నిర్వహించకపోతే చట్టపరంగా ప్రాసిక్యూషన్ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆ నోటీసులో హెచ్చరించారు. ఈ క్రమంలో యాజమాన్యం నుంచి జనవరికి సంబంధించి ఒక పార్ట్ పేమెంట్ జరిగినట్టు సమాచారం. ఇంకా సుమారు రూ.270కోట్లను ట్రస్ట్‌కు చెల్లించాల్సి ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ట్రస్ట్‌కు మినహాయింపులు తొలగించే అవకాశం ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

మినహాయింపు తొలగిస్తే కష్టాలే... : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ట్రస్ట్ ఆధ్వర్యాన ఆన్‌లైన్‌లో రిటర్నబుల్ లోన్, నాన్ రిటర్నబుల్ లోన్ సదుపాయాలు పొందుతున్నారు. ఎప్పటికప్పుడు వలంటరీ పీఎఫ్‌ను ఆన్‌లైన్‌లో పొందే అవకాశం ఉంది. ట్రస్ట్‌కు మినహాయింపు తొలగిపోతే రిటర్నబుల్ లోన్లు ఉండవు. నాన్ రిటర్నబుల్ లోన్, వాలంటరీ పీఎఫ్‌లకు ప్రతిసారి నగరంలోని పీఎఫ్ ఆఫీసుకు తిరగాల్సి ఉంటుంది. ఇక పీఎఫ్ ఫైనల్ సెటిల్‌మెంట్లకు ఎన్ని బాధలుపడాలో అని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పీఎఫ్ సొమ్ము ట్రస్టుకు జమ చేయాలి



ఆరు నెలలుగా ఉద్యోగుల పీఎఫ్ సొమ్ము ట్రస్ట్‌కు జయ చేయకపోవడం అన్యాయం. యాజమాన్యం వైఖరి వల్ల ఉద్యోగులు రుణాలు కూడా పొందలేకపోతున్నారు. ఈపీఎఫ్‌వో వద్ద ట్రస్ట్ డిఫాల్ట్ అయితే ట్రస్ట్‌కు ఉన్న మినహాయింపు పోతుంది. ఎంతో కష్టపడి తెచ్చుకున్న మినహాయింపు పోతే ప్రతి ఉద్యోగి తమ పనుల కోసం పీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. ట్రస్ట్‌కు చెల్లించాల్సి సొమ్ము వెంటనే చెల్లించాలి.

– నీరుకొండ రామచంద్రరావు, స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో(ఐటీఐ) మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. https:// iti. ap. gov. in/ లో జూలై 24లోగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలకు ఒకే దరఖాస్తు సరిపోతుందన్నారు. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం దగ్గరలోని(ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్) కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)-ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది)-గాజువాక, ప్రభుత్వ ఐటీఐ-నరవ) ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకుని.. కౌన్సెలింగ్‌కు అర్హత సాధించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరీలో దరఖాస్తు చేసుకునే విధంగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.



తన పిల్ల కోసం తల్లి కాకి ఎంతగానో తల్లడిల్లిపోయింది. రోజుల వయసున్న కాకి పిల్లను ఒక చోట నుంచి మరో చోటకు నోట కరుచుకుని తీసుకెళ్తుండగా.. జారి కింద పడిపోయింది. దీంతో ఆ లేత ప్రాయపు కాకి పిల్ల గాయపడింది. అక్కడే ఉన్న కొంత మంది ఆ కాకికి మంచి నీళ్లు పట్టి సపర్యలు చేశారు. అయినప్పటికీ కోలుకోలేదు. తల్లి కాకి కాసేపు తన బిడ్డను బతికించుకోవడానికి ఎంతో తాపత్రయ పడింది. చివరకు కన్ను మూసిందని నిర్ధారించుకుని మళ్లీ నోట కరచుకుని సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లిపోయింది. ఇదే కదా తల్లి ప్రేమ అంటూ అక్కడున్న వారు చర్చించుకున్నారు. ఇదంతా వైఎస్సార్ పార్కులో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ దృశ్యాలను 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.

రేపటి నుంచి ఏపీఎల్

- నెట్స్‌లో శ్రమించిన ఆటగాళ్లు



ఆటగాళ్లకు సలహాలిస్తున్న కోచ్



ముమ్మరంగా సాధన చేస్తున్న ఆటగాళ్లు



ప్రాక్టీస్ చేస్తున్న బౌలర్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) మూడో సీజన్‌కు జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న ఈ సీజన్‌లో తలపడేందుకు ఆరు జట్లు శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రాక్టీస్ మొదలుపెట్టాయి. ఈ సీజన్ వేలంలో అత్యధిక ధర పలికిన నితీష్‌కుమార్ రెడ్డి జింబాబ్వే జట్టుతో తలపడే భారత్ టీ-20 జట్టుకు ఎంపిక కావడంతో అందుబాటులో లేడు. కె.ఎస్.భరత్, పి.గిరినాథ్‌రెడ్డి, సీఆర్ జ్ఞానేశ్వర్, ఎస్.కె రషీద్, జి.గుల్ఫామ్ తదితరులు వారి జట్లతో ప్రాక్టీస్ చేశారు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో రాయలసీమ కింగ్స్(ఆర్‌కే), కోస్టల్ రైడర్స్(సీఆర్), బెజవాడ టైగర్స్(బీటీ), గోదావరి టైటాన్స్(జీటీ), ఉత్తరాంధ్ర లయన్స్(యూఎల్)తో పాటు వైజాగ్ వారియర్స్(వీడబ్ల్యూ) జట్లు పోటీపడుతున్నాయి. తొలి పోటీ రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ మధ్య జరగనుంది. జూలై 13న టైటిల్ పోరు ఉంటుంది. కాగా.. శుక్రవారం వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 2 గంటల పాటు రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్ జట్లు ప్రాక్టీస్ చేశాయి. బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్లు సాయంత్రం ఐదు గంటల నుంచి రెండు గంటల పాటు, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్ జట్లు రాత్రి ఏడున్నర నుంచి రెండు గంటల పాటు ప్రాక్టీస్ చేశాయి.

ఫ్యాన్‌కోడ్‌లో ప్రత్యక్ష ప్రసారం

బీచ్‌రోడ్డు: ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌ను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు ఫ్యాన్‌కోడ్ సంస్థ ప్రతినిధి కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ లీగ్‌కు తెలుగు వ్యాఖ్యాతలుగా టి.సుమన్, కల్యాణ్ కృష్ణ వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

ముదిరిన పైత్యం

మల్కాపురం: కూటమి కార్యకర్తల పైత్యం బాగా ముదిరింది. పార్టీల ప్రచారానికి ప్రభుత్వ ఆస్పత్రులను కూడా వదలడం లేదు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద ఎఫ్ఆర్‌యూ 30 పడకల ఆస్పత్రిలో పలు చోట్ల పార్టీల జెండాలు ఉన్న స్టిక్కర్లను అతికించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలాంటి ప్రచారం ఏంటని రోగులు ప్రశ్నిస్తున్నారు.



రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద అతికించిన స్టిక్కర్

మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి భాగస్వామిగా హెచ్‌సీజీ

బీచ్‌రోడ్డు: క్యాన్సర్ కేర్ నెట్‌వర్క్ సంస్థల్లో ఒకటైన హెల్త్ కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌సీజీ) సంస్థ మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో భాగమైంది. ఈ మేరకు మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో చేసుకున్న ఒప్పంద వివరాలను హెచ్‌సీజీ ప్రతినిధి బి.ఎస్.అజయ్‌కుమార్ శుక్రవారం మీడియాకు వివరించారు. 196 పడకలతో 31 మంది వైద్యులతో సేవలందిస్తున్న మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఉత్తరాంధ్ర ప్రజలకు మరింతగా సేవలందించే అవకాశం లభించిందన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు పలు రైళ్లకు తాత్కాలిక పద్ధతిలో అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్‌కు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు జూలై 2 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఓ థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నారు.
- విశాఖపట్నం-నాందేడ్(20811) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 31వ తేదీ వరకు(రైలు నడిచే రోజుల్లో), నాందేడ్-విశాఖపట్నం(20812) ఎక్స్‌ప్రెస్‌కు జూలై 3 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు(రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్‌కు జూలై 1 నుంచి 31వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు.
- విశాఖపట్నం-అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు, అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 6 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు(12845) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7 నుంచి 28వ తేదీ వరకు, ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్ (12846) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 8 నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12830) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4 నుంచి 25వ తేదీ వరకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్ (12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5 నుంచి 26వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-తిరుపతి(22871) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7 నుంచి 28వ తేదీ వరకు, తిరుపతి-భువనేశ్వర్(22872) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూలై 8 నుంచి 29వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నారు.
- భువనేశ్వర్-పుణె(22882) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు, పుణె-భువనేశ్వర్(22881) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 4 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-పుదుచ్చేరి(12898) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 2 నుంచి 30వ తేదీ వరకు, పుదుచ్చేరి-భువనేశ్వర్(12897) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 3 నుంచి 31వ తేదీ వరకు ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు.
- భువనేశ్వర్-రామేశ్వరం(20896) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5 నుంచి 26వ తేదీ వరకు, రామేశ్వరం-భువనేశ్వర్ (20895) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 7 నుంచి 28వ తేదీ వరకు ఒక స్లీపర్‌క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు.
- పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 5 నుంచి 26వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 6 నుంచి 27వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను జత చేస్తున్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి శుక్రవారం బయలుదేరిన పలు రైళ్లను రీ-షెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(12829) వీక్లీ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం ఒంటి గంటకు, ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తలా (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఐదున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 3.30 గంటలకు బయలుదేరాయి.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న లక్ష్మి, తదితరులు

సీతమ్మధార: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర ప్రజలకు ఇచ్చిన ప్రధాన ఎన్నికల హామీలను అమలు చేయాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షలు శుక్రవారం నాటికి 1,262వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రగతి శీల మహిళా సంఘం, పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు ఆమె సంఘీభావం తెలిపి మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. తెలుగు ప్రజల ప్రాణ త్యాగంతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ 8 వేల మందికి పైగా నిర్వాసితులు సర్వం పోగొట్టుకొని, ఉపాధి లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కె.బాలనాగమ్మ, ప్రధాన కార్యదర్శి రోహిణి, కోశాధికారి ఎల్. వరలక్ష్మి, సభ్యులు నాగమణి, జయ, కొండమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.